



# చివరి రోజు నామినేషన్ల జోరు

నామినేషన్ పత్రాలు అందజేస్తున్న గ్రాడ్యుయేట్ అభ్యర్థులు నరేందర్ రెడ్డి, రవీందర్ సింగ్.. టీచర్ అభ్యర్థులు యాదగిరి శేఖర్‌రావు, సుహాసిని






కలెక్టరేట్, ఫిబ్రవరి 10 : కరీంనగర్– మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల నామినేషన్ల జాతర సోమవారం ముగిసింది. చివరి రోజూ హోరెత్తింది. సోమవారం గ్రాడ్యుయేట్ స్థానానికి 51 మంది, టీచర్ స్థానానికి 8 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు వందలాది మంది అనుచరులతో తరలివచ్చి నామినేషన్ల దాఖలు చేశారు. అయితే రవీందర్ సింగ్ నామినేషన్ ర్యాలీలో ఓ అభిమాని, ఒగ్గు కళాకారులు కేసీఆర్ చిత్రపటంతో ప్రదర్శనలు ఇచ్చారు.



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న గ్రాడ్యుయేట్ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



ర్యాలీలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటో ఓ అభిమాని

# సాగునీటి కోసం కలెక్టరేట్‌కు

- 9వ ప్యాకేజీ కెనాల్ బాధిత రైతులు
- చెరువులు నింపాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నపం
- ఇప్పటికే ఎండిన వందెకరాల పంట
- బోర్లు వేసినా ఫలితం లేదని ఆవేదన




కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తున్న రైతులు

ఎల్లారెడ్డిపేట/ సిరిసిల్ల తెలంగాణచౌక్, ఫిబ్రవరి 10 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల పరిధిలోని కాళేశ్వరం 9వ ప్యాకేజీ కెనాల్ పరీవాహక ప్రాంత రైతులు సాగునీటి కోసం కలెక్టరేట్ బాట పట్టారు. గతంలాగే నీళ్లు, కరెంటు బాగున్నట్టే ఇప్పుడు కూడా ఉంటాయని భావిస్తే.. కాలువ నీళ్లు రాక చెరువులు ఎండిపోయి, భూగర్భ జలాలు ఇంకిపోయి విలవిలలాడుతున్న దీన స్థితిలో తాము వేసిన పంట నెలాగైనా కాపాడుకునేందుకు కదిలారు. కిష్టునాయక్‌తండా, రాజన్నపేట, దేవునిగుట్ట తండా, బాకుర్ పల్లి గ్రామాలకు చెందిన సుమారు 40 మంది రైతులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి వినతి పత్రం అందించారు.

## మైసమ్మ చెరువును నింపాలి

ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని మైసమ్మ చెరువును 9వ ప్యాకేజీ కాలువ ద్వారా నీటిని నింపితే అక్కడున్న పంట పొలాలకు నీరందుతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను రైతులు కోరారు. వినతిపత్రం ఇచ్చిన అనంతరం వారు మాట్లాడుతూ... గత ఏడేండ్ల కాలంలో ఏదో ఒక రకంగా ఎగువ మానేరును నింపేందుకు గత సర్కారు పనిచేయడంతో 9వ ప్యాకేజీ కెనాల్ పరీవాహక చెరువుల్లో పుష్కలంగా నీళ్లు ఉండి బోరుబావుల నుంచి నీటి ఊట ఉబికి వచ్చేదని, ప్రస్తుతం



రాజన్నపేట–కిష్టునాయక్ తండాలో ఎండిపోయిన కొత్త చెరువు



నీరులేక వెలవెలబోతున్న మల్కపేట కాల్వ

మండలంలోని అల్మాస్‌పూర్ మొదలు బాకుర్‌పల్లి వరకు ఉన్న మల్కపేట కాలువలో నీళ్లు లేక దానికి ఇరువైపులా ఉన్న పొలాలు నెర్రెలు బారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సుమారు వందెకరాల పంట ఎండిపోయిందని, రాజన్నపేటలోని కొత్త చెరువు, తిమ్మాపూర్‌లోని మైసమ్మ చెరువును నింపితే పంటలు బతుకుతాయని విన్నవించారు.

ఇప్పటికే పలువురు రైతులు బోరుబావులు తవ్వించేందుకు సిద్ధపడ్డారని, సుమారు 400 ఫీట్ల నుంచి 700 ఫీట్ల వరకు బోరుబావులు వేసినా చుక్కనీరు రావడం లేదని తెలిపారు. కాల్వకు నీటిని విడుదల చేస్తే మండలంలోని రాచర్లగుండారం, దేవునిగుట్ట తండా, చింతకుంట తండా, తిమ్మాపూర్, రాజన్నపేట, గొల్లపల్లి, అక్కపల్లి, బుగ్గ రాజేశ్వర తండా, కిష్టునాక్‌తండా, అల్మాస్‌పూర్, బాకూర్‌పల్లితండాలకు చెందిన వ్యవసాయ పంట పొలాలకు నీరంది పంటలు బాగా పండుతాయన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పొలాలల్లో వరి పంట నాట్లు వేసుకుని ఉన్నామని ఈ ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటి నీరు అందడంలేదన్నారు.

## పొలం దిక్కు పోబుద్ధి అయితలేదు..



నాకు మల్కపేట కాల్వ పక్కనే మూడెకరాలన్నర పొలమున్నది. ఎప్పటిలెక్కనే వరి పంటేసిన. ఇగ మంచిగైతదనుకుంటే బోరెండిపోయింది. పొలంల నీళ్లు లేక పర్రెలిడిసింది. అది చూస్తే దుఃఖమొస్తుంది. అందుకే ఏం మనుసున పడుతలేదు. పొలం దిక్కు గూడ పోబుద్ధి అయితలేదు. కాల్వల నీళ్లుంటే కనీసం కాల్వల మోటర్లేసైనా పొలం పారిచ్చుకునెటోళ్లం అందుకే కలెక్టర్ సార్‌ను కలిసి మల్కపేట కాల్వల నీళ్లిడిసి రైతులను ఆదుకోవాలని మా రైతులందరం పోయినం.

**– భూక్యా ప్రభునాయక్, రైతు, కిష్టునాయక్‌తండా(ఎల్లారెడ్డిపేట)**



రాజన్నపేటలో పూడ్చిన క్యూసీ శాంపిల్ రంధ్రాలను చూపుతున్న రైతు
*(ఇన్‌సెట్లో 18 ఇంచుల క్యూసీ గోతిని చూపుతున్న రైతు)*

# పోసింది ఆరు ఇంచులు.. క్యూసీ 18 ఇంచులు

- రాజన్నపేటలో మట్టిరోడ్డు నిర్మాణంలో ఈజీఎస్ తప్పుడు లెక్కలు
- అవినీతి జరిగిదంటూ రైతుల ఆరోపణ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 10: రాజన్నపేటలో మట్టి రోడ్డు మరమ్మతు పనుల్లో అవకతవకలు జరిగాయని రైతులు ఆరోపిస్తున్నారు. పోసిన మట్టి 6 ఇంచులైతే.. ఉపాధి హామీ ఆడిటింగ్ సెంట్రల్ టీమ్ సభ్యులు క్యూసీ కింద 18 ఇంచుల గోతిని తీసి నమూనాగా తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం వారు మాట్లాడుతూ 15 ఏండ్ల క్రితం తమ పొలాల కోసం ఈ దారి ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. 2014కి ముందు కేటీఆర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రోడ్డు కోసం సొంతంగా రూ.25వేలు ఇచ్చారని, దాంతో ఎస్కవేటర్‌ను ఉపయోగించుకుని శ్రమదానం చేసి రోడ్డును వేసుకున్నామని చెప్పారు. అయితే గతేడాది సదరు రోడ్డుపై 6 ఇంచుల మొరం పోసి ఇప్పుడు 18 ఇంచులు పోసినట్లు క్యూసీ తీసుకెళ్లారని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు సోషల్ ఆడిట్‌కు ముందు మరోమారు రోడ్డు నాణ్యత శాంపిల్స్‌ను సేకరించాలని కోరుతున్నారు.

# వేములవాడకు కలాం స్ఫూర్తి యాత్ర



వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న విద్యార్థులు

వేములవాడ, ఫిబ్రవరి 10: విద్యార్థులు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు కలాం స్ఫూర్తి యాత్ర పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బస్సు యాత్ర సోమవారం వేములవాడకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పిల్లలు బస్సులో వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా కలాం స్ఫూర్తి యాత్ర సీఈవో మధులాష్ బాబు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని విద్యార్థులు అనివార్యంగా భావించాలన్న లక్ష్యంతో బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజరత్నం, సైన్స్ ఉపాధ్యాయుడు దేవయ్య, పీడీ అమిద్ ఉన్నారు.

# అన్ని రంగాల్లో రాణించాలి

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 10: విద్యార్థులు చదువులతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేసి, మాట్లాడారు. ఈ నెల 12న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# నీటి ఎద్దడి రాకుండా చర్యలు

వీర్నపల్లి, ఫిబ్రవరి10: వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జీ ఎంపీడీవో అబ్దుల్ వజిద్ పేర్కొన్నారు. మండలకేంద్రంతో పాటు కంచర్లలో పలు కాలనీల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న వనరులపై దృష్టి సారించినట్లు చెప్పారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్, గ్రిడ్ ఏఈ కార్తీకేయ, కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

# పసుపు క్వింటాలు @ రూ.11,511

మెట్‌పల్లి, ఫిబ్రవరి 10: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం పసుపు కాడి (కొమ్ము) క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.11,511, కనిష్ఠ ధర రూ.6,116 పలికింది. అలాగే పసుపు గోళ (మండ)కు గరిష్ఠ ధర రూ.9,518, కనిష్ఠ ధర రూ.6,012, పసుపు చూర క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.9,766, కనిష్ఠ ధర రూ.5,151 పలికినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.